


# కరపత్రం

SINCE 2014

గురువారం ఆగస్ట్ 14 2025 సంపుటి :0 సంచిక :299 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## టారిఫ్‌ల వేళ..

## అమెరికా పర్యటనకు ప్రధాని మోదీ..!

**ఈ పర్యటనలో భాగంగా ఆయన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సహా పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.**

- **ప్రధాని మోదీ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే నిమిత్తం అమెరికా వెళ్తున్నారు.**
- **ట్రంప్ మొదట 25% సుంకం విధించారు, అది ఇప్పటికే అమలులో ఉంది. మిగిలిన 25% సుంకాలు ఈ నెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి.**



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై 50 శాతం సుంకం విధించారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ . ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల నిమిత్తం ప్రధాని మోదీ యూఎస్‌కు వెళ్లనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సహా పలువురు విదేశీ నేతలతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. జెలెన్‌స్కీ, మోదీ ఇటీవలే ఫోన్‌లో మాట్లాడుకున్న విషయం సంగతి తెలిసిందే. న్యూయార్క్ వేదికగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశం సెప్టెంబరులో జరగనుంది. దీనికి ప్రపంచదేశాల నాయకులు హాజరుకానున్నారు. రష్యా తో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తుండటంతో భారత్‌పై ట్రంప్ మండిపడుతున్నారు. ఈ క్రమంలో భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ దాన్ని 50శాతానికి పెంచారు. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. మిగిలిన 25శాతం టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీనికి ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూఢిల్లీ చర్చలు జరుపుతోంది.

## తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్: తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు,

## కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకంపై స్టే.. సుప్రీం సంచలన తీర్పు



2లో

## తెలంగాణ ఆర్టీసీ..

### రాఖీ పండగకు రికార్డు స్థాయిలో మహిళల ప్రయాణాలు



2లో

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం



2లో

హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపుర్, రాయదుర్గం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఎస్సార్ నగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, పంజాగుట్ట, బోరబండ, యూసఫ్ గూడా, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేట, బహదూర్‌పల్లి, సూరారం, కొంపల్లి, సుచిత్ర, జీడిమెట్ల,

# రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ

## ఎక్కడికైనా వెళ్లి ప్రజలను అడుగుదామా

## డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ సవాల్





డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు గుప్పించారు. అందులోభాగంగా డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు ఆరుగ గ్యారెంటీల వాగ్దానం గుర్తుందా ? అని ప్రశ్నించారు. 100 రోజులు కాదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 2 సంవత్సరాలు అయినా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదంటూ మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలంగాణలోని ఏ గ్రామానికైనా వెళ్లి చెప్పగలరా? అంటూ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కను కేటిఆర్ తన ఎక్స్ ఖాతా వేదికగా సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పిన మీ నాయకులను ప్రజలు వెంబడిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు- క్యాబినెట్ మంత్రులంతా తెలంగాణలో ఎక్కడికైనా వెళ్లి.. తమ ప్రభుత్వం ఆరు హామీలు నెరవేర్చామని చెప్పాలని ఆయన సూచించారు. మీ అబద్ధాలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టక పోతే.. నేను రాజకీయాలను విడిచి పెడతానంటూ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ-ఆర్ సవాల్ విసిరారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలు విమానాల దారి మళ్లింపు



హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలు విమానాలను దారి మళ్లించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 9 విమానాల్లో విజయవాడకు 5, బెంగళూరుకు 3, తిరుపతికి ఒక విమానాన్ని మళ్లించారు. హైదరాబాద్ నుంచి బయల్దేరాల్సిన మూడు విమానాలను తాత్కాలికంగా రద్దు చేశారు. అయితే మళ్లించిన వాటిలో 7 విమానాలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత పద్ధతి అమలు
యూరియాను బీహార్‌కు తరలిస్తున్నారు
ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా యూరియా రాదు
యూరియా కోసం క్యూలో ఉన్న రైతులతో హరీష్ రావు



2లో

# సంపాదకీయం

## నైతిక రాజకీయాలు ఎండమావులేనా

'ప్రతిపక్షాలకు ప్రజాస్వామిక సంస్థలంటే విశ్వాసం లేదు. పార్లమెంటు సమావేశాలు కొనసాగించడం వారికి ఇష్టం లేదు. పార్లమెంటు ముఖ్యమైన సమయాన్ని ప్రతి రోజూ వృథా చేయడాన్ని మేము ఇక అనుమతించబోం.. ముఖ్యమైన బిల్లులను ఆమోదించి తీరుతాం..' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. సోమ, మంగళవారాల్లో పార్లమెంటు పెద్దగా చర్చ లేకుండా దాదాపు పది బిల్లులను ఆమోదించింది. జూలై 21న ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు ప్రతిపక్షాల నిరసన ధ్వనుల మధ్య ఒకటి రెండు రోజులు తప్ప పెద్దగా సాగలేదు.ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చ జరిపించడం ఏ ప్రభుత్వానికీ ఇష్టం ఉండదు. గతంలో కూడా బోఫోర్స్ నుంచి 2జీ వరకు అనేక కుంభకోణాలపై ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించాయి. రోజుల తరబడి పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించాయి. 'ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించనప్పుడు పార్లమెంటుకు అంతరాయం కలిగించడం ప్రతిపక్షాల చట్టబద్ధమైన హక్కు' అని యూపీఏ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్న అరుణ్ జైట్లీ అన్నారు. 'పార్లమెంటును సాగనివ్వకపోవడం కూడా ప్రజాస్వామ్యంలో భాగమే' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సుష్మా స్వరాజ్ కూడా చెప్పారు. పార్లమెంటు సమావేశాలు ఒకప్పుడు ఎంతో ఆసక్తి కలిగించేవి. అటల్ బిహారీ వాజపేయి, ఇంద్రజిత్ గుప్తా, చంద్రశేఖర్, సోమనాథ్ ఛటర్జీ లాంటి వారు మాట్లాడుతుంటే మీడియా గ్యాలరీలతో పాటు అతిథుల గ్యాలరీలు కూడా కిక్కిరిసిపోయేవి. కానీ ఇప్పుడు గ్యాలరీలేకాదు సభలు కూడా వెలవెలబోతున్నాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై తప్ప ఏ అంశంపైనా చర్చ జరగలేదు. ఈ చర్చలో కూడా ప్రతిపక్ష నేతలు ఆవేశంతో ప్రశ్నలు వేసినప్పటికీ అన్నీ ఒకే మాదిరిగా ఉన్నాయి. ఆ ప్రశ్నలకు కూడా సరైన సమాధానాలు రాలేదు. భారత సైనిక దళాలు వీరోచితంగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పార్లమెంటులో ప్రభుత్వం ఏ జవాబు చెబుతుందా అని ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా ఎదురు చూశారు. కానీ రెండు రోజుల సుదీర్ఘ చర్చ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘ ప్రసంగం తర్వాత కూడా అనేక ప్రశ్నలకు జవాబులు లభించకుండా మిగిలిపోయాయి. ముఖ్యంగా పహల్గామ్ సంఘటనకు దారి తీసిన భద్రతా వైఫల్యం నుంచి ఆపరేషన్ ఉన్నట్లుండి 88 గంటల్లో ముగిసిన తీరు, భారత్ పాక్‌కు బుద్ధి చెప్పే పరిస్థితుల్లో ఉన్నప్పటికీ కాల్పుల విరమణకు అంగీకరించడం, పాక్ పట్ల అమెరికా స్నేహంగా వ్యవహరించడం, సంఘటనకు కారకులైన ఉగ్రవాదుల ఆచూకీ, విదేశాంగ విధానం గురించి ప్రజల్లోను, ప్రతిపక్షాల్లోనూ ఉన్న ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు రాలేదు. అధికార పార్టీ నేతలు ఇచ్చిన ప్రసంగాల్లో పహల్గామ్ కంటే నెహ్రూ, ఇందిరాగాంధీ పేర్లే అనేకసార్లు దొర్లాయి. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో చాలా పొరపాట్లు జరిగి ఉండవచ్చు కానీ వాటినే చర్విత చర్వణం చేయడం వల్ల సాధించేదేముంటుంది? పహల్గామ్ సంఘటన సరే, బిహార్‌లో ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ గురించి ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నప్పటికీ దానిపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఎస్ఐఆర్‌పై గందరగోళం జరుగుతున్న సమయంలోనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటకలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా బోగస్ ఓట్ల పోలింగ్ జరిగిందని ఆయన సాక్ష్యాధారాలతో బయటపెట్టారు. దేశంలో ఎన్నికల కమిషన్ బీజేపీని గెలిపించేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఓట్ల చోరీ జరుగుతోందనే అభిప్రాయాన్ని ఆయన ప్రజల్లో బలంగా ఏర్పరిచేందుకు ప్రయత్నించారు. ఎస్ఐఆర్ పైనే కాదు, ఓట్ల చోరీపై కూడా ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చను డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను తిప్పిగొట్టగలమన్న విశ్వాసం ఉంటే ఏ ఒక్క అంశంపైనైనా చర్చకు అంగీకరించి ప్రభుత్వం వారి ఆరోపణలు తప్పని చెప్పేందుకు ఆస్కారం ఉన్నది. నిజానికి ఓట్లను తొలగించడం, బోగస్ ఓటర్లను చేర్చడం అనేది ఎన్నికల వ్యవస్థకు చెదలు పట్టేలా చేస్తోంది. 'నా నియోజకవర్గంలో కూడా 3.5 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మా బంధువుల ఓట్లు కూడా లేకుండా పోయాయి' అని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సైతం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తన కొడంగల్ నియోజకవర్గంలో 15వేల ఓట్లు గల్లంతైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వీటిపై ప్రభుత్వం పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తే కాదనేవారెవరు ఉన్నారు? అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత దేశంలో కూడా కెన్యా, మొజాంబిక్ లాంటి దేశాల్లో లాగా అక్రమాలు చేసి ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారనే అభిప్రాయం ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడడం మంచిదా?

పార్లమెంటును సాగనివ్వకపోవడం వల్ల ప్రతిపక్షాలకు ప్రయోజనం లభిస్తుందా? చాలాసార్లు లభించకపోవచ్చు. కానీ ప్రభుత్వం కీలకమైన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు నిరాకరిస్తున్నదని ప్రజలు భావిస్తే ప్రతిపక్షాల ప్రశ్నలకు కూడా ఆమోదయోగ్యత లభిస్తుంది. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలు ప్రజల్లో కూడా కలిగితే పార్లమెంటును వాయిదా వేసినా ప్రభుత్వం ప్రజా కోర్టులో జవాబుచెప్పలేని పరిస్థితిలో పడుతుంది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు పార్లమెంటులో ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలను జైలులో నిర్బంధించారు. కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. గతంలో బోఫోర్స్ విషయంలోను, 2జీ కుంభకోణం విషయంలోనూ పార్లమెంటులో ప్రభుత్వం జవాబులు చెప్పకుండా తప్పించుకుని ఉండవచ్చు. కానీ ప్రజలు జవాబుదారీ ప్రభుత్వాన్ని ఆశించినందువల్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి పట్టం కట్టారు.ప్రస్తుతం దేశంలో ఆ పరిస్థితి ఏర్పడుతోందా? అని చెప్పడం కష్టం. ప్రభుత్వం కానీ వ్యవస్థలు కానీ జవాబులు చెప్పలేని పరిస్థితిలో పడుతోందని మాత్రం అనిపిస్తోంది. నిజానికి పార్లమెంటు కంటే బయట జరుగుతున్న పరిణామాలు చాలా ఆసక్తి కలిగిస్తాయి. ప్రతిరోజూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలు, ఎన్నికల కమిషన్‌కు ఊరేగింపుగా వెళ్ళి అనేకమంది అరెస్టు కావడం వంటి సంఘటనలు ఒక ఎత్తు అయితే రాహుల్ నివాసంలో జరిగిన విందుకు మొత్తం ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు అందరూ హాజరు కావడం మరొక ఎత్తు. దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ సంఘటితం కావడమే కాదు, రాహుల్ వారి నేతగా ఆవిర్భవించడం భారత రాజకీయాల్లో జరిగిన కీలక పరిణామం. ఇటీవలి కాలం వరకూ రాహుల్ నాయకత్వంపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. ఇప్పుడు ఆ ప్రశ్నలు చెరిగిపోతున్నాయి. అయితే అంత మాత్రాన రాహుల్ మోదీకి ప్రత్యామ్నాయ నేతగా మారారా అన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. సార్వత్రిక ఎన్నికలు ఇప్పట్లో లేవు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే బిహార్ ఎన్నికల్లో సంఘటితంగా పోరాడినప్పటికీ అధికారంలోకి రాగలరా అన్న విషయం కూడా ఇప్పుడే చెప్పలేం. అక్కడ ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ, చిరాగ్ పాశ్వాన్ లోక్‌జనశక్తికి వస్తున్న ప్రతిస్పందన ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. బిహార్ మాత్రమే కాదు వచ్చే ఏడాది జరిగే తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమబెంగాల్ ఎన్నికలు ప్రతిపక్షాల సత్తాకు ఒక అగ్నిపరీక్ష. రాహుల్, ఆయన మిత్రపక్షాలు సంఘటితంగా సార్వత్రిక ఎన్నికల వరకూ నిలదొక్కుకునేందుకు ఎంతో పోరాడాల్సిన అవసరం ఉన్నది.

ఈ లోపు ఆయన లేవనెత్తుతున్న ఎన్నికల అక్రమాలపై ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా తన వైపునకు తిప్పుకోగలరా అన్నది వేచి చూడాలి.

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

మొదటిపేజీ తరువాయి

జగద్గిరిగుట్ట, బాలానగర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, జవహర్ నగర్, బొల్లారం, ప్యాట్నీ, పారడైజ్, చిలకలగూడ, మారేడుపల్లి, కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, నాంపల్లి, బషీర్ బాగ్, హిమాయత్ నగర్, నారాయణ గూడ, ట్యాంక్ బండ్, సైదాబాద్, చంపాపేట్, సరూర్ నగర్, సంతోష్ నగర్, లంగర్ హౌస్, గుడిమల్కాపూర్, గోల్కొండ, జియాగూడ, మెహదీపట్నం, ఆసిఫ్ నగర్, పాతబస్తీ, చార్మినార్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, బార్కస్, ఉప్పుగూడ, ఛత్రినాక ప్రాంతాల్లో వర్షం పడుతోంది. దీంతో నగరవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో బుధ, గురువారాల్లో ఒంటిపూట బడులు నడపాలని ఆదేశించారు. పిల్లల్ని మధ్యాహ్నం ఇంటికి పంపించేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఐటీ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి బుధవారం ఇంటి నుంచి పని చేసే అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుండపోత వానలతో నగరంలోని రోడ్లు జలమయమై, ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందనే అంచనాలతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది.

## కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకంపై స్టే.. సుప్రీం సంచలన తీర్పు

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలను భారత రాష్ట్ర సమితి నేత దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది.

## తెలంగాణ ఆర్టీసీ..

### రాఖీ పండగకు రికార్డు స్థాయిలో మహిళల ప్రయాణాలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండగ సందర్భంగా తెలంగాణలో మహిళలు రికార్డు స్థాయిలో ఆర్టీసీ లో ప్రయాణాలు సాగించారు. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ వెల్లడించింది. ఈ మేరకు వివరాలను ఆ సంస్థ ఎండీ సజ్జనార్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు."రాఖీ పండగ నాడు (ఆగస్టు 9) 45.62లక్షల మంది మహిళలు ఆర్టీసీలో ప్రయాణించారు. 11న అత్యధికంగా 45.94లక్షల మంది రాకపోకలు సాగించారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి. గతేడాది రాఖీ పండగకు 2.75కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాం. అప్పటితో పోలిస్తే 92.95లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ ఏడాది బస్సులు 2.28 కోట్ల కిలోమీటర్లు తిరిగాయి. గతేడాదితో పోలిస్తే 53 లక్షల కిలోమీటర్లు అదనం" అని ఆర్టీసీ పేర్కొంది.మంత్రి పొన్నం హర్షం మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో సోదర, సోదరీమణుల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ పండగ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. విపరీతమైన రద్దీలోనూ ఉచిత బస్సు పథకాన్ని విజయవంతంగా అమలు చేశారని ప్రశంసించారు. ముందస్తు ప్రణాళికతో పాటు నిబద్ధతతో పనిచేయడం వల్లే లక్షలాది మంది ప్రయాణికులను సిబ్బంది క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చారని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు.

## ట్రంప్ టారిఫ్‌ల వేళ.. మాస్కోకు విదేశాంగ మంత్రి జైశంకర్



పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని..లేదంటే అధిక పన్నులు విధిస్తామని అమెరికా (%ఖు%) భారత్‌పై బెదిరింపులకు దిగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యా పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20-21 తేదీలలో మాస్కోలో పర్యటించనున్న విదేశాంగ మంత్రి ఇరుదేశాల మధ్య సంబంధాలపై ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ తో చర్చలు జరపనున్నట్లు సమాచారం. కాగా జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ప్రస్తుతం మాస్కో పర్యటనలో ఉన్నారు.

భారీ సుంకాలతో అమెరికా విరుచుకుపడుతున్న వేళ...రష్యాతో స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ అడుగులువేస్తోంది. ఇందులో భాగంగానే భారత ప్రధాని మోదీ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక బంధం బలోపేతంతో పాటు పెట్టుబడులు, వాణిజ్యం, ఆర్థిక విషయాలపై చర్చించుకున్నారని దిల్లీ, మాస్కోల నుంచి విడివిడిగా విడుదలైన అధికారిక ప్రకటనలు తెలిపాయి. ఉక్రెయిన్‌తో ఘర్షణ తాజా పరిస్థితిని పుతిన్ వివరించగా శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న తన సూచనను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు వచ్చే పుతిన్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నట్లు రాసుకొచ్చారు.

మరో వైపు 15వ తేదిన పుతిన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవ్వనున్నారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు, ఉక్రెయిన్‌తో యుద్ధం, వాణిజ్య ఒప్పందాలు మొదలైన విషయాలపై వీరిరువురు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా పాల్గొనే అవకాశముంది.

## పౌరసత్వం తీసుకోక ముందే ఓటర్ల జాబితాలో సోనియా పేరు: భాజపా

భాజపా, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. వాటిని కాషాయ పార్టీ తిప్పి కొట్టింది. ఎన్నికల్లో అవకతవకల గురించి భారీ ప్రసంగాలు, నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని భాజపా నేత అమిత్ మాలవీయ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ విధంగా పౌరసత్వం లేని వారికి ఓటు హక్కు ఎలా కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు.భారత ఓటర్ల జాబితాలో సోనియా గాంధీ పేరు చేర్చి అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాలవీయ అన్నారు. "భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందు ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉంది.. అప్పటికి ఆమె ఇటాలియన్.ఆ సమయంలో ఓటర్ల జాబితాలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీలతో పాటు సోనియా గాంధీ పేరు కూడా చేర్చారు. ఈ విషయంపై 1982లో నిరసనలు వ్యక్తమవ్వడంతో ఆమె పేరును తొలగించారు. 1983 జనవరిలో తిరిగి చేర్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం మంజూరయ్యింది.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

మొదటిపేజీ తరువాయి

యూరియా కోసం అన్నదాతలు నడిరోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు తిరిన రైతులను చూసి మాజీ మంత్రి హరీష్ రావు ఆగారు. ఈ సందర్భంగా వారిని పలుకరించగా.. ఉదయం 5 గంటల నుండి ఇక్కడే ఉంటున్నాం.. ఒక ఆధార్ కార్డుకి ఒకటే బస్తా ఇస్తామంటున్నారు. ఆధార్ కార్డు, ఓటీపీ అంటూ కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని హరీశ్‌రావుతో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఈ గోస లేదని.. కాంగ్రెస్ వచ్చాక నీళ్ళు లేవు, యూరియా లేదు అంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. యూరియా ఎప్పుడు వేసుకోవాలి.. ఎప్పుడు పంట పండాలి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ హయంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉదయం నుండి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేదు అని అగ్రికల్చర్ అధికారులపై హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడంలో విఫలం అయ్యారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎరువుల కొరతపై నోరు మెదపడం లేదు.. రైతుల ఉసరు ఉట్టిగా పోదు.. 4 రోజుల నుండి వ్యసాయ పనులు వృధా చేసుకొని యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బిజేపీలకు తగిన గుణపాఠం చెపుతారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీకి పోయాడు.. కానీ ఎరువుల కొరత తీర్చలేదు. మీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి తిట్లు- ఎక్కువ పని తక్కువ అని. ప్రజలకు కావాల్సింది తిట్లు కాదు, పని కావాలి. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ధ్యాస.. పని మీద లేదు. రైతులు సూటిగా అడుగుతున్నారు కేసీఆర్ ఉన్నపుడు ఎరువులు ఎట్లా వచ్చాయి.. ఇప్పుడు ఎట్లా రావు అని. వెంటనే ఓటీ-పీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు- హరీశ్‌రావు పేర్కొన్నారు.

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎరువుల ఇబ్బంది లేదు. ప్రతి మండలానికి గోదాంలు ఏర్పాటు- చేసుకొని, వేసవి కాలంలోనే ఎరువులు స్టాక్ పెట్టినం. గ్రామం నుండి రైతు కాలు బయట పెట్టకుండా.. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు లేకుండా రైతు సమయం వృధా కాకుండ గ్రామంలోనే ఎరువులు అందించాం. నాలుగు రోజుల నుండి ఇక్కడికి వచ్చి ఉంటే ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరం. దేవుడు దర్శనం దొరుకుతుంది కానీ ఎరువుల బస్తా దొరకడం లేదని మహిళా రైతు భాగ్యమ్మ చెప్పడం ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం. వెంటనే ఓటీ-పీ విధానం, ఒక బస్తా విధానంను తీసేయాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల బస్తాలు ఇవ్వాలని డిమాండ్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు.మళ్ళీ పాత రోజులు వచ్చాయి.. ఇదేనా కాంగ్రెస్ మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం, నానో యూరియా వాడాలని చెప్పడం రైతులపై 500 రూ. అదనపు భారం వేయడమే. నానో యూరియ తో రైతులకు ఎకరానికి రూ. 500లు భారం పడుతుంది. ప్రభుత్వం సబ్సిడీ నుండి తప్పించుకోడానికి కృత్రిమ ఎరువులను సృష్టిస్తుంది. ఎన్నికలు ఉన్నాయని బీహార్‌కు ఎరువులను తరలిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.

## తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి

రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు.

ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.

## గవర్నర్ నుంచి డిగ్రీ తీసుకోవడానికి నిరాకరించిన విద్యార్థిని..




తమిళనాడు లోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి డిగ్రీ పట్టాలు అందిస్తుండగా విద్యార్థులంతా వరుసగా వచ్చి..వాటిని తీసుకుంటున్నారు. అయితే జీన్ జోసెఫ్ అనే ఓ విద్యార్థిని మాత్రం గవర్నర్ పిలుస్తున్నా పట్టించుకోకుండా పక్కనే ఉన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ నుంచి డిగ్రీని అందుకుంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మరింది.

సదరు విద్యార్థిని గవర్నర్ పట్ల వ్యవహరించిన తీరుపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విధంగా ప్రవర్తించిన విద్యార్థిని జీన్ జోసెఫ్‌ను అధికార డీఎంకే పార్టీకి చెందిన నాగర్‌కోయిల్ డిప్యూటీ సెక్రటరీ ఎం రాజన్ భార్యగా గుర్తించారు. గవర్నర్‌కు అధికార డీఎంకే ప్రభుత్వానికి మధ్య ఉన్న భేదాభిప్రాయాల కారణంగా ఆమె ఉద్దేశపూర్వకంగానే స్టేజీపై ఈ విధంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది.తమిళనాడు ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి కి మధ్య కొంతకాలంగా అభిప్రాయ భేదాలు కొనసాగుతున్నాయి. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవికి పంపగా ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లుల్ని సమ్మతించకపోవడం, పునఃపరిశీలించాలని సూచిస్తూ వెనక్కి కూడా పంపడం లేదని తెలిపింది. రెండోసారి ఆమోదించిన బిల్లుల విషయంలోను ఆయన తీరు మారలేదంటూ పిటిషన్‌లో పేర్కొంది. ఈ చర్యను రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ ఇటీవల సుప్రీం తీర్పు వెలువరించింది.

# భారతదేశానిది చచ్చిన ఎకానమీ నట!

**- బ్రెయిన్ డెడ్ మనుషుల వాదన డెడ్ ఎకానమీ**

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

కొన్నిసార్లు కొంతమంది మాట్లాడే మాటలకు, ప్రకృతి సహకరించదు. పరిస్థితులు కూడ సహకరించవు.

ట్రంప్ భారత్ ఆర్థిక వ్యవస్థ చనిపోయింది, "డెడ్ ఎకానమీ" అని కూస్తున్న సమయానికే..అమెరికాలో పెద్ద కంపెనీ అయిన జి.ఇ. (జెనరల్ ఎలక్ట్రిక్) తాము భారతదేశానికి చెందిన సంస్థ హెచ్.ఏ.ఎల్ (హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్) తో కలిసి యుద్ధ విమాన ఇంజన్ల తయారీ ప్లాంట్ పెడుతున్నామని ప్రకటించింది.

**- పెట్టడమే కాదు టెక్నాలజీ బదిలీ (ట్రాన్స్‌ఫర్) కూడ చేస్తాం అని ప్రకటించడంతో ట్రంప్ కు చెంప చెళ్ళుమన్నట్లయ్యింది**

**భారత ఆర్థిక వ్యవస్థ చనిపోలేదు**
**భారత ఆర్థిక వ్యవస్థ చలనం గలది, బలమైనది**

**మన దేశీయ మార్కెట్‌తో ట్రంప్ వ్యాఖ్యలకు చెక్ పడింది.**

ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థను "డెడ్ ఎకానమీ" అని, 25% సుంకాలు, ఇంకా అదనపు సుంకాలు అంటే పన్నులు విధిస్తామని అన్నారు.కానీ, భారత్ కేవలం ఎగుమతులపై ఆధారపడే దేశం కాదు. 1.4 బిలియన్ల జనాభాతో బలమైన దేశీయ మార్కెట్‌పై ఆధారపడే ఆర్థిక శక్తి భారత్.అమెరికాకు ఈ స్థాయిలో దేశీయ డిమాండ్ లేదు.




**- నిజాలు చూద్దాం**

భారత్ దేశానిది బలమైన దేశీయ మార్కెట్.భారత జిడిపి (స్థూల దేశీయ ఉత్పత్తి)లో 60% వినియోగ వ్యయం నుండి వస్తుంది.మనది 1.4 బిలియన్ల జనాభా. ఇది పెరుగుతున్న మధ్యతరగతి శక్తిని తెలియజేస్తుంది.2024లో రిటైల్ మార్కెట్ 1.2 ట్రిలియన్ డాలర్లు.2030 నాటికి 2.2 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని స్టాటిస్టా కంపెనీ వేసిన అంచనా.అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియో మార్ట్‌లు ఈ డిమాండ్‌ను సమర్థంగా ఉపయోగించుకుంటున్నాయి.అమెరికా జిడిపి లో వినియోగం 70% ఉన్నప్పటికీ, జనాభా 330 మిలియన్లు మాత్రమే.భారత్‌తో పోలిస్తే చాలా తక్కువ.భారత జనాభాతో పోలిస్తే అమెరికా జనాభా 23% మాత్రమే.దీనివల్ల అమెరికా దేశీయ మార్కెట్ పరిమాణం భారత్ కంటే చిన్నది.

**జి.ఇ. & హెచ్.ఏ.ఎల్ ఒప్పందం**

ట్రంప్ "డెడ్ ఎకానమీ" అని చెప్పిన వెంటనే, అమెరికా దిగ్గజం జి.ఇ. భారత్‌లో హెచ్.ఏ.ఎల్‌తో యుద్ధ విమాన ఇంజన్ల తయారీకి ఒప్పందం కుదుర్చుకుంది.టెక్నాలజీ బదిలీతో 20 బిలియన్ డాలర్ల ఒప్పందం.

**భారత రక్షణ మార్కెట్ డిమాండ్.**

"మేక్ ఇన్ ఇండియా" విధానాలు ఈ ఒప్పందాన్ని సాధ్యం చేశాయి.చనిపోయిన ఆర్థిక వ్యవస్థలో ఇలాంటి ఒప్పందాలు జరుగుతాయా?

**- టెస్లా భారత్‌లో ప్లాంట్**

ట్రంప్ మిత్రుడు ఎలాన్ మస్క్ ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోకుండా, భారత్‌లో టెస్లా గిగా ఫ్యాక్టరీ స్థాపించేందుకు 2-3 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రకటించారు.భారత్‌లో విద్యుత్ వాహనాల (ఈవి) మార్కెట్ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఈవై అంచనా.మస్క్ ట్రంప్ సుంకాలు అమెరికాను దివాళా తీస్తాయని కూడా హెచ్చరించారు!

**- ఆపిల్ భారత్‌లో విస్తరణ**

ఆపిల్ భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా ఎంచుకుంది.
2024లో 23 బిలియన్ డాలర్ల ఐఫోన్ ఎగుమతులు.
2025లో 30 బిలియన్ డాలర్ల లక్ష్యం.
భారత్ యువ జనాభా, స్థానిక డిమాండ్ వల్ల 2024లో 10 మిలియన్ ఐఫోన్లు అమ్మకం.ఆపిల్‌ను ఆకర్షిస్తోంది ు అమెరికా స్వంత మార్కెట్ డిమాండ్ ఈ స్థాయిలో లేదు.

**- భారత్ ఆర్థిక చలనం**

భారత జిడిపి 2014లో 2 ట్రిలియన్ డాలర్ల నుండి 2025లో 4.19 ట్రిలియన్ డాలర్లకు,2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ఐఎంఎఫ్ ప్రకటించింది.6.5% వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని.భారత్ ఎగుమతులు 2024లో 776 బిలియన్ డాలర్ల తో పాటు, దేశీయ మార్కెట్ భారత్‌ను స్థిరంగా నడిపిస్తోంది.అమెరికా జిడిపి 28 ట్రిలియన్ డాలర్లతో భారీగా ఉన్నప్పటికీ, దాని వృద్ధి 1.8% వద్ద మందగించింది.35 ట్రిలియన్ డాలర్ల రుణ భారంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటోంది.

**- ట్రంప్ డబుల్ టాక్**

ట్రంప్ ఒకవైపు భారత్‌ది "డెడ్ ఎకానమీ" అని, మరోవైపు మోదీతో 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం లక్ష్యంగా పెట్టుకున్నారు.2020లో "భారత్ గొప్ప ఆర్థిక శక్తి" అని పొగిడి, ఇప్పుడు సుంకాలతో ఒత్తిడి పెంచాలని ప్రయత్నిస్తున్నారు.కానీ, భారత్ దేశీయ డిమాండ్, యుకే, యూరోపియన్ యూనియన్‌తో ఉచిత వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది.ఆత్మనిర్భర్ భారత్‌గా ఈ సవాళ్లను అధిగమిస్తోంది.

**- ఇది నా విశ్లేషణ:**

**భారత దేశీయ మార్కెట్ బలమైనది**
**భారత్ జనాభా 1.4 బిలియన్లు.**
**అమెరికా జనాభా 330 మిలియన్లు.**

అమెరికా జనాభా, భారత జనాభా కంటే 4 రెట్లు తక్కువ.మన జనాభా ఎక్కువ. ఇది రిటైల్, ఎఫ్ఎంసిజి, ఆటోమొబైల్, టెక్నాలజీ వంటి రంగాలలో భారీ డిమాండ్‌ను సృష్టిస్తుంది.ఉదాహరణకు, 2024లో భారత్‌లో 4.2 మిలియన్ కార్లు అమ్ముడయ్యాయి. భారత్ డిమాండ్ బలంగా ఉంది.

**- అమెరికాది ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థ**

అమెరికా జిడిపి లో ఎగుమతులు 12% ఉండగా, భారత్‌లో 22% ఉన్నప్పటికీ%ా% భారత దేశీయ వినియోగం 60%తో ఆర్థిక స్థిరత్వాన్ని ఇస్తోంది.

అమెరికా ఎగుమతులు 2.5 ట్రిలియన్ డాలర్లు. భారత్ ఎగుమతులు 776 బిలియన్ డాలర్లు. మన దేశం కంటే అమెరికా ఎగుమతులు ఎక్కువ. అమెరికా ఎగుమతులు తగ్గితే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కిందా మీదవుతుంది.

**- అమెరికా దేశీయ డిమాండ్ పరిమితం**

భారత్ యొక్క ఆస్తి యువత. భారత్‌లో యువత సగటు వయస్సు 20 నుండి 40 ఏళ్లు.

ఒకప్పుడు జనాభా మనకు భారమని అనుకున్నాం, ఇప్పుడు అదే జనాభా మన ఆస్తి.

**- సరైన మార్గంలో యువతని వాడుకోవాలి**
**- యువత మన బలం. మన ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి యువత వెన్నెముక.**


## ఈటల రాజేందర్ హర్ ఘర్ తిరంగా

### - ఘట్‌కేసర్‌లో భారీ ర్యాలీ




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
భారత దేశవ్యాప్తంగా బిజెపి నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ లోని ఘట్‌కేసర్ రూరల్ మండలంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవాలని, దేశభక్తిని ప్రతీ ఇంటికి చేర్చాలన్న ప్రధాని ఆకాంక్షను నెరవేర్చాలని అన్నారు. ఈ ర్యాలీలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడ్చల్ రాఘవేంద్ర స్వామి ఆలయంలో చోరీ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో గత మూడు రోజుల నుండి హరిహర మహోత్సవాలు జరుగుతున్నాయి.అందులో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో భక్తులు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు భక్తుల వద్ద ఉన్న ఐదు సెల్ ఫోన్లు, 1 ల్యాప్టాప్ చోరీ చేశారు.భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని సీసీటీవీని పరిశీలిస్తున్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టాలి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
తెలంగాణ ప్రభుత్వం, విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకయ్య, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని యువతకు బుధవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల విద్యా కమిషనర్ శ్రీ దేవసేన, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్. రాజేంద్ర సింగ్ ల నుండి వచ్చిన ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగింది.

## మార్కండేయ మందిర నిర్మాణానికి విరాళం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో శ్రీ శివభక్త మార్కండేయ మందిర నిర్మాణానికి అడ్వకేట్ వంగరి గంగారాం, ఆయన తండ్రి పెద్ద గంగారాం రూ. 25,116 విరాళం బుధవారం అందజేశారు. దీంతో వారు శాశ్వత సభ్యులుగా మారారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం వారి కుటుంబ సభ్యులకు మార్కండేయ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

## గోదావరి తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
గోదావరి నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ మహమ్మద్ సలీం బుధవారం సూచించారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, సిబ్బందితో కలిసి కోమటికొండపూర్, ఎర్దండి గ్రామాల్లో గోదావరి నది పరివాహక ప్రాంతాలను, తీరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాన్ని, నదిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎంపీడీఓ ఆదేశించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శులు, కారోబర్, తదితరులు పాల్గొన్నారు.

## మెటుపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బుధవారం 12వ వార్డులో మెయిన్ డ్రైనేజ్ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. భారీ వర్షాలు కొనసాగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను బయటకు వెళ్లనీయకూడదని సూచించారు. వర్షం ఆగిపోతే మున్సిపల్ కార్యాలయానికి లేదా సంబంధిత వార్డు జవాన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## సిద్దిపేట జిల్లా ఆడిట్ ఆఫీసర్, సిద్దిపేట టిజీవో జిల్లా కార్యదర్శి ఏ. జయశ్రీ కి కరీంనగర్‌లో ఘన స్వాగతం.

**కరపత్రం ప్రతినిధి సిద్దిపేట ఆగస్టు 13**
సిద్దిపేట జిల్లా ఆడిట్ ఆఫీసర్, సిద్దిపేట టి జీ ఓ జిల్లా కార్యదర్శి ఏ. జయశ్రీ కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా టిఎన్జీవోల భవన్ కు విచ్చేయగా, జిల్లా జేఏసీ చైర్మన్ & టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాసరెడ్డి ఘన స్వాగతం పలికారు.స్వాగత కార్యక్రమం అనంతరం ఉద్యోగుల సమస్యలు, ముఖ్యంగా కరీంనగర్ జిల్లా ఆడిటు విభాగ ఉద్యోగుల యోగక్షేమాలు చర్చకు వచ్చాయి. జయశ్రీ వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకుని, పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు ఏవి రాజేశ్వరరావు, పవన్ శంకర్, చిరంజీవి, సచితు వెంకట్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్, ఆడిటు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 సందర్భంగా మహానుభావుల విగ్రహాలకు స్వచ్ఛమైన నీటితో శుద్ధి

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలా రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మహానుభావుల విగ్రహాలను రేకుర్తి చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహాన్ని స్వచ్ఛమైన నీటితో శుద్ధిచేసి అనంతరం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.శాతవాహన యూనివర్సిటీ వద్ద మాజీ పశ్చిమ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి 17, 38 ,39వ బూత్ లోని శక్తి కేంద్రం ఇన్చార్యులు ఉప్పరపల్లి శ్రీనివాస్, గుండారపు సంపత్,ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాల వేశారు. శివ థియేటర్ వద్ద ఎన్నం ప్రకాష్, మామిడి రమేష్ ల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని శుద్ధిచేసి పూలమాలలు వేశారు. జాడి బాల్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ భారతదేశాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని రాబోయే రెండు సంవత్సరాల్లోపుల మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు .అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్ని కుట్రలు చేసినా తిప్పికొట్టే శక్తి భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ కి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గోదారి నరేష్ ,18, 19 బూత్ అధ్యక్షులు నాంపల్లి శంకర్, గంట్ల నరసింహారెడ్డి ,వరాల దేవేందర్ ,చారి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడి చోరీ యాత్రలు

**కరపత్రం ప్రతినిధి నెల్లూరు,ఆగస్ట్13:**
దివ్యాంగుడే..కానీ చేసేది మాత్రం దొంగతనం..రైళ్లలో నిద్రిస్తున్న ప్రయాణికులే అతడి టార్గెట్..రాత్రివేళ్లలో ఏసీ బోగీల్లోకి ప్రవేశించి తన చోరీకళ ప్రదర్శిస్తాడు. చాకచాక్యంగా బ్యాగుల్లోంచి విలువైన వస్తువులు మాయం చేస్తాడు. తెలుగు రాష్ట్రాల్లో కదులుతున్న రైళ్లలో లక్షల సొత్తు కాజేసిన కేటుగాడు. దివ్యాంగుడిగా టికెట్టు- తీసుకొని దర్జాగా చోరీలు చేస్తున్న అంతర్ రాష్ట్ర గజదొంగను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కదులుతున్న రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర గజదొంగను నెల్లూరు రైల్వే పోలీసులు పట్టుకున్నారు. రైల్వే డీఎస్పీ వివరాల ప్రకారం..నెల్లూరు, గూడూరు, కావలి సహా పలు రైల్వే స్టేషన్ల పరిధిలో జరిగిన రైలు దొంగతనాల కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని ప్రశ్నించగా అతను పాత నేరస్తుడని, గతంలో హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, నంద్యాల, తిరుపతి రైల్వే స్టేషన్లలో జరిగిన 10కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు- బయటపడింది. అతని దగ్గర నుంచి రెండు మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 143 గ్రాముల బంగారం మొత్తం సుమారు రూ. 12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# వనమాసంలో ప్రతి మహిళ భాగస్వామి కావాలి

## – ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఆగస్టు 13:** వన మహోత్సవంలో ప్రతి మహిళా భాగస్వాములు కావాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్ .రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధ వారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వశక్తి మహిళలతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకానికి కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో వాటిని నాటడం , సంరక్షణా పనులను కూడా మహిళా సంఘాలకే అప్పగిస్తే అవినీతికి తావు లేకుండా ఉంటుందని అన్నారు. మహిళలు తమ కుటుంబ సభ్యుల పేర్లపై మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణానికి మేలు చేసిన వారవుతారని అన్నారు. స్వశక్తి మహిళలను వివిధ వ్యాపారాలలో భాగస్వాములను చేసి



కోటీశ్వరులను చేయాలని తమ ప్రభుత్వం కంకణం కట్టుకొని అనేక ప్రోత్సాహకాలు అందజేస్తుందని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలను చైతన్య పరిచి వారికి సబ్సిడీ రుణాలు ఇప్పించి ఆర్టిసి బస్సులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించడం జరుగుతున్నదని అన్నారు. రామగుండంలోనూ త్వరలో ఈ తరహా యూనిట్లు ప్రారంభం కానున్నాయని అన్నారు. అంతర్గాంలో మహిళల ఉపాధి కోసమే రూ 2. కోట్ల అంచనా వ్యయంతో ఒక ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనపై ఆశక్తి ఉన్న స్వశక్తి మహిళలు ముందుకు రావాలని అన్నారు. రామగుండం నగరంలో అనేక అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. అభివృద్ధి



పనులు జరుగుతున్న క్రమంలో తవ్వకాలతో కొంచెం ఇబ్బందులు ఎదురవుతే సర్దుకొని సహకరించాలని అన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. మహిళలను తమ ప్రభుత్వం మహా లక్ష్మీగా గౌరవిస్తూ ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నదని అన్నారు. ఒక్క గోదావరిఖని ఆర్ టి సి డిపో బస్సుల్లోనే ఏడాదిలో 3.5 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని అన్నారు. ఇందిరా నగర్ , ఇందిరమ్మ కాలనీ , పి.కె.రామయ్య క్యాంప్ తదితర అన్ని మురికివాడల్లో సకల వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో సప్తగిరి కాలనీ ముంపునకు గురి కాకుండా వరద కాలువ నిర్మించడంతో భవనాల నిర్మాణం పెరిగి అందమైన కాలనీగా రూపుదిద్దుకుంటున్నదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందజేయడం జరిగిందని అన్నారు. రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌళిక వసతులు కల్పించడం జరుగుతున్నదని అన్నారు.

అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), కమిషనర్(ఎఫ్ఎసి) జె. అరుణశ్రీ మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది రామగుండం నగర పాలక సంస్థకు 4,80,000 మొక్కలు నాటాలని లక్ష్యం విధించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 1,92,000 మొక్కలు ఇంటింటికీ పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అన్నారు . రామగుండం నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న నర్సరీలతో పాటు 50 వేల మొక్కలు హెచ్ఎండిఎ నర్సరీ ల నుంచి తెప్పించడం జరిగిందని అన్నారు. గృహస్థులకు నచ్చిన మొక్కలను ఇవ్వడంతో పాటు మెప్మా ఆర్పిలు రిజిస్టర్ లో నమోదు చేసుకొని మొక్క పెరుగుతున్న తీరును కూడా రికార్డు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.రామన్ , వన మహోత్సవం డి.ఇ.ఇ. షాభాజ్ , ఎఈ తేజస్విని, జూనియర్ అసిస్టెంట్ సాయి, మెప్మా టిఎంసి మౌనిక తోపాటు తాజా మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి , బొంతల రాజేష్. ముస్తాఫా. ఆర్పిలు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు. అనంతరం మల్కాపూర్ శివారులోని డంపింగ్ యార్డ్ లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 83 లక్షల అంచనా వ్యయంతో డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్ట్ షెడ్ నిర్మాణ పనులకు శిలా ఫలకం ఆవిష్కరించి రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), కమిషనర్ ( ఎఫ్ఎసి) జె.అరుణశ్రీ, రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, నగర పాలక సంస్థ ఎస్ఈ శివానంద్ , ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.రామన్, తాజా మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్ , ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఎస్బిఐ లైఫ్ భీమా చెక్కు అందజేత..



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 13**

జమ్మికుంట: ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లో పాలసీ తీసుకొని దురదృష్టవశాత్తు గుండెపోటుతో మరణించిన పూలాల కుమారస్వామి (జమ్మికుంట మున్సిపాలిటీ బిల్ కలెక్టర్) కుటుంబానికి 10 లక్షల బీమా సొమ్మును మృతుని భార్య పూలల సుమలతకు మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా భీమా చెక్కు అందించడం జరిగింది. పూలాల కుమారస్వామి ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లో స్మార్ట్ స్కాలర్ అనే పాలసీ తీసుకోవడం జరిగిందని, ఈ పాలసీకి గాను మూడు సంవత్సరాల ప్రీమియం చెల్లించడం జరిగిందని, గుండెపోటు రావడం వల్ల అతని కుటుంబానికి 10 లక్షల బీమా సొమ్ము వెంటనే అందించడం జరిగిందన్నారు. అతనూ కట్టవలసిన రెండు కిస్తీలను ఎస్బిఐ లైఫ్ కంపెనీ చెల్లిస్తుందని, తద్వారా 25వ సంవత్సరం నాడు పాపకు మెచ్యూరిటీ అమౌంట్ అందుతుందన్నారు. భీమా చెక్కు పంపిణీలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ టెరిటరీ మేనేజర్ భీమని రమేష్ బాబు, లైఫ్ మిత్రులు జడల చిరంజీవి, బోగోజు అనిల్ కుమార్, మేకల వేణుగోపాల్, మునిసిపల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# ఆటోను అతివేగంగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు..నుజ్జునుజ్జు అయినా ఆటో

**కరపత్రం ప్రతినిధి అందోల్ :**




అందోలు నియోజకవర్గం అల్లాదుర్గ్ మండలంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని చిల్వర గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా మరో ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు అల్లాదుర్గం మీదుగా లింగంపల్లి వైపు వెళ్తు చిల్వర బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న ఆటోను అతివేగంగా ఢీకొనగా ఆటోలో ఉన్న ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ముగ్గరిని నేషనల్ హైవే వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో గ్రామస్తులు కోపోద్రిక్తులై రహదారిపై బైఠాయించారు. పలుమార్లు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జుగా మారింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# సింగూర్ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

## -ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి :**



ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వర్ధనీరు భారీగా చేరుతుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ప్రాజెక్టు అధికారులు విద్యుత్ ప్లాంట్ ద్వారా ప్రాజెక్టు గేటును ఎత్తేసి వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. ప్రస్తుతం సింగూర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి 5,000 క్యూసెక్కులు వరద నీరు వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తుగా దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు దిగువ ప్రాంతాల వారు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువులు, గొర్ల కాపరులు, చేపల వేటకు పోయే వారు నదిలోకి వెళ్లరాదని నీటి పారుదల శాఖ అధికారులు సూచించారు.

# చెత్త సేకరణపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు..

## నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్







**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట: ఆగస్టు 13**

రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ నుండి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని అందులో భాగంగానే బుధవారం పట్టణంలోని గర్ల్ హై స్కూల్ లో విద్యార్థులకు వాతావరణంలో వచ్చే మార్పులు, చెత్త సేకరణపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ విద్యార్థులు మీ తల్లిదండ్రులకు చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను వేరుగా చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి చెత్త డబ్బులు అందించామని, చెత్తను వేరు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో డి. ఆర్. సి. సి. ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తడి చెత్తతో ఎరువులను తయారు చేస్తున్నామని, పొడి చెత్త అంటే ప్లాస్టిక్ బాటిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను వేరు చేయడానికి సంఘ సభ్యులు 10 మంది ఉన్నారని, వారికి కూడా అక్కడ జీవనోపాధి లభిస్తుందని ఆయన తెలిపారు. చెత్త సేకరణలో ప్రతి ఒక్కరు విధిగా చెత్తను వేరు చేయాలని అయన విద్యార్థులకు వివరించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బ్యాగ్ లు అందించగా, డ్రాయింగ్ పోటీలలో పాల్గొన్న వారందరికీ పెన్నులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది ఈఈ శ్రీ కాంత్ పలువురు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కులను అరిస్తే చట్టరీత్యా నేరం

- ఆదివాసీ విద్యార్థిని విద్యార్థులు లక్ష్యసాధన తో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి ఎం. హేమలత
- జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**

తెలంగాణ రాష్ట్ర, మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం పురస్కరించుకొని ఆదివాసీల పరిరక్షణ చట్టాలను విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించుటకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ గిరిజన గురుకుల కళాశాల లో న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది,

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ విచ్చేసి మాట్లాడుతూ అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులు గిరిజన చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు, ఆదివాసీల హక్కులను అరిస్తే చట్టరీత్యా కఠినంగా శిక్షించబడతారు, ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాన్ని జీవనశైలిని పరిరక్షించుకుంటూ నేటి సమాజంలో అన్ని రంగాలలో ముందడుగులో ఉండడం కోసం భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను సంపూర్ణంగా పొందుతూ ఆదివాసీల పురోగతికి కంకణబద్ధులు కావాలన్నారు, విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు, మనిషి సాధించలేనిది ఏమీ లేదని అంకితభావంతో పట్టుదలతో శ్రమిస్తే అనేక విజయాలు సాధించి, సమాజంలో గొప్ప స్ఫూర్తిని ఇవ్వగలం అన్నారు, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివాసీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, వారి జీవన స్థితిగతులకు అవరోధం కల్పించిన, ఎస్సీ ఎస్టీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించబడతారు అన్నారు, గ్రామీణ ప్రాంత నిరుపేద పేద వర్గానికి చెందిన ప్రజలు చట్టపరమైన న్యాయ సహాయం అవసరం ఉన్నచో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, నర్సాపూర్ ను ఆశ్రయించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బాలాజీ, న్యాయవాదులు రాజు నాయక్, సాయికుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# జమ్మికుంట పట్టణంలో బిజెపి ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ తీరంగా ర్యాలీ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 13**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశ సార్వభౌమత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక మన మువ్వన్నెల జెండా.దేశ భక్తికి, సమగ్రతకు, జాతీయ భావానికి, ఐక్యతకు కూడా ప్రతిబింబం ఈ మూడు రంగుల జెండా దేశ ప్రజలందరినీ ఒక తాటిపైకి తెచ్చేందుకు త్రివర్ణ పతాకాన్ని మించిన సాధనం ఏముంటుందని,అందుకే మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత మూడు సంవత్సరాలు కిందట 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా పేరిట దేశంలోని ప్రతి పౌరుడు తమ ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేసి దేశ భక్తిని చాటాలని ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు, ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, రాజేష్ ఠాకూర్, గూడూరి శ్రీనివాస్, పల్లపు రవి, కైలాసకోటి గణేష్, అప్పం మధు, ఇటుకాల స్వరూప, బచ్చు శివన్న, మోడం రాజు, రాకేష్ ఠాకూర్, బల్సుకూరి రాజేష్, కొండ్లె నగేష్, బూరుగుపల్లి రాము, శనిగరపు రవి, యాంసాని సమ్మయ్య, బొజ్జ శరత్, మురికి మహేష్, మేడిపల్లి మహేష్, ఆకుల పోచయ్య, సిరియాల విజయ్, శ్రీవర్తి ప్రవీణ్, రోషన్, బోనగిరి ప్రణీత్, ముకుందా సుధాకర్, నాగపురి విజయ్, అప్పాల రవిందర్, మ్యాదరి శంకర్, మల్లాడి సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు